ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి రూరల్, నవంబర్ 4 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామాన్ని కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అదనంగా హమాలీలను నియమించాలని సూచించారు. ధాన్యంలో చెత్త లేకుండా జల్లెడ పట్టాలన్నారు. ధాన్యం తూకంలో ఎలాంటి వ్యత్యాసం రాకుండా ప్రతి బస్తా 40.600 కిలోల తూకం వేయాలని చెప్పారు. తూకం వేసిన బస్తాలను లారీల్లో నింపి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్ రావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, ఇన్ చార్జి పౌర సరఫరాల అధికారి నరసింహ రావు, జిల్లా సహకార అధికారి రాంమోహన్, తహసీల్దార్ జనార్దన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

కామారెడ్డి, నవంబర్ 4 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. 67 వినతులను స్వీకరించామని తెలిపారు. ఈ నెల 6 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎన్యుమరేటర్లకు పవర్ పాయింట్ ద్వారా మండల స్థాయిలో శిక్షణ నిర్వహించాలని అన్నారు. 10 శాతం మందిని అదనంగా ఎన్యుమరేటర్లను నియమించుకోవాలని సూచించారు. సర్వే చేసేందుకు కావాల్సిన స్టేషనరీ సామగ్రి సమకూర్చాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో మోడల్ ఇండ్లను నిర్మించాలని తెలిపారు. ధాన్యం సేకరణలో భాగంగా మండల, డివిజన్‌స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, ఆర్వీ రంగనాథ్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గర్గుల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

రాజంపేట తహసీల్ కార్యాలయంలో..

రాజంపేట్, నవంబర్ 4 : రాజంపేట తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సామాజిక ఆర్థిక సర్వే, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎమ్మెల్సీకి సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశాలు ఇచ్చారని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు.

డిగ్రీ కళాశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

పోచారం శ్రీనివాసరెడ్డితో మాట్లాడుతున్న అతిథి అధ్యాపకులు

బాన్సువాడ రూరల్, నవంబర్ 4 : బాన్సువాడ మండలం, దేశాయిపేట్ గ్రామంలోని శ్రీరాంనారాయణ్ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాలలను రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రగతి, కళాశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధ్యాపకులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కళాశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. శ్రీరాంనారాయణ్ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏండ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమకు కనీస వేతనం అందించి ఆదుకోవాలని అతిథి అధ్యాపకులు కోరారు. హవర్లీ బేస్డ్‌తో సెలవుల్లో, పరీక్షల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నామని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి, అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, భీమయ్య, అనిల్, మనోహర్, మోహన్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కామారెడ్డి, నవంబర్ 4 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రైతులకు అందుబాటులో ప్యాడీ క్లీనర్స్ తదితర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో పౌరసరఫరాల వ్యవసాయం, మార్కెటింగ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్, టార్పాలిన్లు, తూకం మిషన్లు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సన్న రకం, దొడ్డు రకం వడ్లు విడివిడిగా కొనుగోలు చేయాలని చెప్పారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని జిల్లా మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి నరసింహారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కామారెడ్డి, నవంబర్ 4 : రైతులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు అన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలో సోమవారం అధికారులు రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈ కళ్యాణ్ చక్రవర్తి, ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి ఆర్ఐ బదిలీ

మాచారెడ్డి, నవంబర్ 4 : మాచారెడ్డి ఆర్ఐ మాలిక్ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. గాంధారిలో పనిచేస్తున్న రమేశ్ బదిలీపై మాచారెడ్డికి వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ భిక్షపతి తెలిపారు. ఆర్ఐగా రమేశ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.

ఆర్థికసాయం అందజేత

బాన్సువాడ టౌన్, నవంబర్ 4 : పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ సురేశ్ కుటుంబసభ్యులకు పురుషులు, మహిళా సివిల్ కానిస్టేబుల్ బ్యాచ్ తరపున సోమవారం రూ. 90 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమతోపాటు విధులు నిర్వహిస్తున్న నరేశ్ మృతి చెందడం బాధాకరమని అన్నారు.

బాపురెడ్డి సంతాప సభ

నివాళులర్పిస్తున్న మలిదశ తెలంగాణ ఉద్యమకారులు

బాన్సువాడ టౌన్, నవంబర్ 4 : అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాపురెడ్డి సంతాప సభను పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బాన్సువాడ మలిదశ తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

తాళం వేసి ఇండ్లల్లో చోరీ

మాచారెడ్డి, నవంబర్ 4 : తాళం వేసిఉన్న రెండిండ్లల్లో చోరీ జరిగిన ఘటన పాల్వంచ మండలంలోని మంథనిదేవునిపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాట్ల రాజు మాచారెడ్డిలో ఉన్న తన అల్లుడు ఇంటికి ఆదివారం పండుగ కోసం వెళ్లగా సోమవారం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయని, బీరువాలోని రూ.40 వేలు నగదుతో పాటు నాలుగు తులాల వెండి గొలుసులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన నెత్తట్ల సత్తయ్య ఇంటి తాళం పగులగొట్టి రూ.5 వేలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

భిక్కనూరు/రాజంపేట్, నవంబర్ 4 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని బస్వాపూర్ విండో చైర్మన్ మద్ది స్వామి అన్నారు. మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బస్వాపూర్ సింగిల్ విండోలో పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించగా రైతులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎలాంటి తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తీర్మానించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఈవో మహేశ్వరి, విండో పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రాజంపేట మండలం ఆర్గొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో సబ్ సెంటర్లు గుడితండా, ఎల్లారెడ్డిపల్లి తండా, శేర్ శంకర్ తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ కంది శివరాములు ప్రారంభించారు.

కార్యక్రమంలో సదాశివనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్యా నాయక్, వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు లంబాడి మాలి, బండారి చిన్న సాయిలు, వ్యవసాయ విస్తరణాధికారిణి రజిత, సీఈవో సాయిలు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు

రేషన్ షాపు ప్రారంభం

మాచారెడ్డి/రాజంపేట్, నవంబర్ 4 : పాల్వంచ మండలంలోని ఏల్పుగొండలో రేషన్ షాపును తహసీల్దార్ జయంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. త్వరలో ఇంటింటికీ సర్వే నిర్వహించి రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు ఇలియాజ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాజంపేటలో నూతన రేషన్ షాప్‌ను గిర్దావర్ లక్ష్మయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నజీ ముద్దీన్, రేషన్ డీలర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ స్థాయి క్విజ్ పోటీలు

కామారెడ్డి, నవంబర్ 4 : జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీ స్థాయి (మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) క్విజ్ పోటీలకు సోమవారం విద్యార్థులను ఎంపిక చేశారు. ముగ్గురు విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పర్యవేక్షకుడు సందీప్, కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, అకడమిక్ ప్రిన్సిపాల్ మనోజ్, అధ్యాపకులు రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల్లో యోగాసన స్పోర్ట్స్‌ను కలపాలి

కామారెడ్డి, నవంబర్ 4 : త్వరలో నిర్వహించే సీఎం కప్ పోటీల్లో యోగాసన స్పోర్ట్స్‌ను కలపాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సాట్ డిప్యూటీ డైరక్టర్ రవీందర్‌కు యోగాసన అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ నందనం కృపాకర్, సూర్య ప్రకాశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలామృతంలో పురుగులు

బాలామృతంలో పురుగులు, ప్లాస్టిక్ కవర్లు

కామారెడ్డి, నవంబర్ 4 : జిల్లా కేంద్రంలోని ఆర్‌బీనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఇచ్చే బాలమృతంలో పురుగులు వచ్చిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. లబ్ధిదారు వనజ తెలిపిన వివరాల ప్రకారం.. తన కూతురు, మరిది కొడుకును బాలామృ తం కోసం ఆర్‌బీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా బాలామృతం ఇచ్చారని తెలిపింది. ఇంటికి వెళ్లి చూడగా 50 శాతం చెక్కెర, దాంట్లో ప్లాస్టిక్ కవర్లు, పురుగులు కనిపించాయి. వెంటనే అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అంగన్‌వాడీ టీచర్ సురేఖను అడుగగా తనకు ఏమీ తెలియదని, తమకు అలాగే పంపారని.. మీరు చూసుకొని వాడుకోవాలని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. మరో బాలామృతం ప్యాకెట్ ఇవ్వగా దాంట్లో కూడా పురుగులు వచ్చాయి. ఈ విషయమై సంబంధిత అధికారినికి ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

టీపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

మాచారెడ్డి, నవంబర్ 4 : మండల కేంద్రంలో టీపీటీఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మాచారెడ్డి టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా చుక్కాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడు నరేందర్, మండల ప్రధాన కార్యదర్శిగా మాచారెడ్డి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి అనిల్, రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణం, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివా స్, లింగం, నళినీదేవి, లక్ష్మి, రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ..

కామారెడ్డి, నవంబర్ 4 : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా సంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లకావత్ లక్యానాయక్, కోశాధికారిగా శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులుగా గోపి, గడ్డం నర్సయ్య, సహాయ కార్యదర్శులుగా దుబ్బాక నర్సింహులు, సుంకరి రవి, ఉపాధ్యక్షులుగా సంతోష్, సుభాష్, ఏసురత్నం, జ్ఞానేశ్వర్, దేవేందర్, మహిళా కార్యదర్శులుగా శ్రీలత, సునీత, సంధ్యరాణి, పద్మ, రాణి, కార్యదర్శులుగా స్వాతి, నవీన, సంధ్య, కవిత, సంయుక్త కార్యదర్శులుగా రాజు, మారుతి, టెక్నికల్ వింగ్ కన్వీనర్ లక్ష్మణ్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రంథాలయం సందర్శన

మాచారెడ్డి, నవంబర్ 4 : మాచారెడ్డి గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలపై ఆరా తీశారు. గ్రంథాలయ భవనాలను ఆధునీకరించడానికి త్వరలో నిధులు మంజూరు చేస్తామని, అవసరమైన మేరకు స్టడీ మెటీరియల్స్ అందిస్తామని అన్నారు. కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నౌసీలాల్, గణేశ్‌నాయక్, శ్యాం పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 4: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సోమవారం ఉదయం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కలిశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానా పెండింగ్ బిల్లులను త్వరగా విడుదల చేయాలని ఆయన డిప్యూటీ సీఎంను కోరారు. దాంతోపాటు ఎల్లారెడ్డిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయాలని, లింగంపేట్ మండలం మోతె గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన భూమిని సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. దీనికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

లింగంపేట/బిచ్కుంద/ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 4: లింగంపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులను సోమవారం ఉదయం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు విడుదల చేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డిని కలవడానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా ఐలాపూర్, బాణాపూర్, లింగంపేట గ్రామాలకు చెందిన సర్పంచులను అరెస్ట్ చేశారు. బిచ్కుంద పోలీసులు ఆదివారం అర్ధరాత్రి ముందస్తుగా మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో దడ్గి విఠల్‌రెడ్డి, సంజు పటేల్, హస్గుల్ మారుతి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు ఉన్నారు. మాజీ సర్పంచ్‌లను ఎల్లారెడ్డి పోలీసులు సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ మాజీ సర్పంచ్ పెరుగు నాగరాజు, రుద్రారం సర్పంచ్ సత్యం, కళ్యాణి సర్పంచ్ రఘువీర్‌గౌడ్‌ను ముందస్తు అరెస్ట్ చేశారు.

రామలింగేశ్వర ఆలయంలో ఆప్కాబ్ చైర్మన్ పూజలు

రామారెడ్డి నవంబర్ 4: మండలంలోని మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రభుత్వ ఆప్కాబ్ చైర్మన్ మార గంగారెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

'ప్రజావాణి'లో చిల్లెర్గి గ్రామస్తుల ఫిర్యాదు

పెద్ద కొడప్‌గల్, నవంబర్ 4: పిట్లం తహసీల్ కార్యాలయంలోని సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో చిల్లెర్గి గ్రామస్తులు అసైన్‌మెంట్ భూమి అక్రమంగా పట్టా చేసుకున్నవారి పట్టా రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చిల్లెర్గి గ్రామ శివారులో సర్వే నంబర్ 267/2/1లో ఉన్న ఎకరం పది గుంటల భూమి బాన్సువాడ నివాసులైన రెహానా బేగం అక్రమంగా గ్రామస్తులకు తెలియకుండా పట్టా చేసుకొని కబ్జా చేశారు. ఈ సర్వే నంబర్‌లో ఉన్న భూమిని గతంలో ప్రభుత్వం క్రీడా ప్రాంగణం కోసం కేటాయించింది. అక్రమ పట్టాను రద్దు చేసి గ్రామస్తులకు న్యాయం చేయాలని తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రజావాణిలో ఎల్లారెడ్డి రెండో వార్డు ప్రజల ఫిర్యాదు..

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 4: కాలనీలోని పాత మురికి కాలువను పునరుద్ధరించి తమ ఆరోగ్యాలను కాపాడాలని కలెక్టర్‌కు పట్టణంలోని రెండో వార్డు ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలనీలోని ఇండ్లలో నుంచి వచ్చే మురికినీరు నిల్వ ఉండడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురి అవుతున్నారని మురికికాలువను పునరుద్ధరించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

షిఫ్ట్ డ్యూటీలను అమలు చేయాలి

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 4: ఎల్లారెడ్డి విద్యుత్ ఉప కేంద్రాల్లో విధుల్లో ఉన్న తమకు 8 గంటల షిఫ్ట్ డ్యూటీలు అమలు చేయాలని ఆర్టిజన్ కార్మికులు కోరారు. సోమవారం పట్టణంలోని ఎన్సీడీసీఎల్ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఆటల పోటీలు

గాంధారి, నవంబర్ 4: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో (ఈఎంఆర్ఎస్) మూడు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 23 ఈఎంఆర్ఎస్ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. సోమవారం జరిగిన పోటీల్లో అండర్ -19 కబడ్డీ ఫైనల్‌లో మరిమడ్ల పాఠశాల ప్రథమ, ఇంద్రవెల్లి ద్వితీయ, ఖోఖోలో టేకులపల్లి ప్రథమ, నార్నూర్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో బాల్‌నగర్ ప్రథమ, గాంధారి ద్వితీయ, ఫుట్‌బాల్‌లో సిర్పూర్(పీ) ప్రథమ, మరిమడ్ల ద్వితీయ, హ్యాండ్‌బాల్‌లో టేకులపల్లి ప్రథమ, గాంధారి ద్వితీయ, వాలీబాల్‌లో టేకులపల్లి ప్రథమ, చర్ల ద్వితీయ, హాకీ నార్నూర్ ప్రథమ, మరిమడ్ల ద్వితీయ స్థానంలో నిలిచాయి. అనంతరం విజేత జట్లకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో ఓవరల్ ఛాంపియన్‌గా గాంధారి ఈఎంఆర్ పాఠశాల నిలిచింది. ఈ కార్యక్రమానికి హాజరైన క్రీడల అధికారి వీర్యనాయక్ విజేతగా నిలచిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో గాంధారి ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ సురేశ్ చంద్ర, మరిమడ్ల ప్రిన్సిపాల్ ఆర్ఎస్ యాదవ్, ఎల్లారెడ్డి పేట్ ప్రిన్సిపాల్ మంజిత్, ఇందల్వాయి ప్రిన్సిపాల్ రమేశ్‌కుమార్, ఆయా పాఠశాలల క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీ ఫైనల్‌ల్లో తలపడుతున్న క్రీడాకారులు

తప్పుడు ప్రచారం చేస్తే కేసులు నమోదు చేస్తాం

లింగంపేట, నవంబర్ 4: సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని జంబి హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగంపేటలోని జంబి హనుమాన్ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హనుమాన్ చాలీసా ఫ్లెక్సీని దహనం చేసిన విషయం వాస్తవమే అన్నారు. ఈ విషయమై సామాజిక మాధ్యమాల్లో, మీడియాలో లింగంపేటలో ఉద్రిక్తత వాతవరణం నెలకొన్నదని తప్పుడు ప్రచారం చేసినట్లు తెలిపారు. ఫ్లెక్సీ దహనం విషయమై విచారణ చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్సై అరుణ్, ఏఎస్సై ప్రకాశ్, స్థానికులు పెద్ది శివయ్య, మురళి ఉన్నారు.

ఆదర్శరైతులను విధుల్లోకి తీసుకోవాలి

లింగంపేట, నవంబర్ 4: వ్యవసాయ శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా గతంలో విధులు నిర్వహించి తొలగించబడిన ఆదర్శ రైతులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదర్శ రైతులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి తీర్మానం చేశారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరినట్లు వారు తెలిపారు.

'ధాన్యం నాలుగు కిలోల తరుగు తీస్తున్నారు'

నాగిరెడ్డిపేట, నవంబర్ 4: ధాన్యం క్వింటాలుకు 4 కిలోల తరుగు తీస్తూ సొసైటీలు రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నాయని, ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బంజారా, మేలకుంట తండాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. 40 కేజీల బస్తాకు 42 కేజీల 200 గ్రాములు కాంట వస్తున్నట్లు రైతులు తెలిపారు. దీంతో క్వింటాలు ధాన్యానికి 4కేజీల తరుగు పోతుందని రైతులకు నష్టం వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

వాలీబాల్ కిట్ వితరణ

లింగంపేట, నవంబర్ 4: మండలంలోని ముంబాజీపేట తండాకు చెందిన అండర్-14 విద్యార్థులకు తండాకు చెందిన యువకుడు బానోత్ నరేశ్ వాలీబాల్ కిట్ వితరణ చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తండాకు చెందిన విద్యార్థులకు క్రీడలపై ప్రోత్సాహం కల్పించడానికి కిట్ అందించినట్లు తెలిపారు. తండాకు చెందిన యువకులు సర్దార్ సింగ్, అశోక్, గణేశ్, రాహుల్, మహేశ్ ఉన్నారు.

నీలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 5: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో ఆలయపూజారి సంగప్ప ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన పూజల్లో భాగంగా స్వామి వారికి మేలుకొలుపు, నమకం, చమకం, రుద్రంతో జలాభిషేకం, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

**రామేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవ